సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 24 । జూన్ । 2024



వేగంగా సవరణ

వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.
8లో



ఎర్రజెండాలే ప్రజలకు అండ..

ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఎర్రజెండాలే అండగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని అన్నారు.
8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో 85 జంటలు పాల్గొన్నాయి. ప్రస్తుత ఈఓ రమాదేవి సెలవుపై వెళ్లడంతో వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు సోమవారం ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించనున్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

'జలవిహారం' కలేనా?

భద్రాచలం వద్ద భక్తులకు గోదావరిలో జలవిహారం కలగానే మిగిలిపోతోంది. వేలంపాట ద్వారా తాత్కాలికంగా బోట్లను తిప్పేందుకు గ్రామపంచాయతీ అధికారులు అవకాశం ఇస్తున్నారు. కానీ శాశ్వత ప్రాతిపదికన బోటింగ్ పాయింట్‌ను, టూరిజం స్పాట్‌లను అభివృద్ధి చేయటంలో ఆయా శాఖలు చొరవ చూపటం లేదు. కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖలు కూడా శీతకన్ను వేస్తున్నాయి. – భద్రాచలం

- భద్రాచలం వద్ద టూరిజం అభివృద్ధిపై శీతకన్ను
- గోదావరిలో విహారం ఏర్పాటు చేస్తే భక్తులకు ఆహ్లాదం
- శాశ్వత బోటింగ్ పాయింట్‌తో ఆదాయం, ఉపాధి



పాపికొండల నడుమ గోదావరి నదిపై పర్యాటకుల జలవిహారం (ఫైల్)

ప్రస్తుతం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బోటింగ్..

మహారాష్ట్రలో పుట్టి సుదీర్ఘంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహించే గోదావరి భద్రాచలం మీదుగా ప్రయాణిస్తోంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో వేంచేసియున్న శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకునేందుకు, ఏజెన్సీ ప్రాంత ప్రకృతి అందాలను, జలపాతాలను, పాపికొండలను వీక్షించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. భద్రాచలం, పర్ణశాల పుణ్యక్షేత్రాల్లో గోదావరిలో నీరు ఉన్నప్పుడు భక్తులకు, పర్యాటకులకు నదిలో కొద్ది సేపు విహారం చేసేందుకు ఇంజన్‌తో కూడిన పడవలకు అనుమతిని ఇస్తున్నారు. ఇందు కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహిస్తున్నారు. ఎగువ నుంచి ప్రవాహ ఉధృతి పెరిగినప్పుడు నిర్వాహకులు ఎప్పటికప్పుడు బోటింగ్ పాయింట్ మార్చుకుంటున్నారు.

బోటింగ్ పాయింట్‌కు అనుకూలతలు..

గోదావరి స్నానఘాట్‌లకు ఎగువన, దిగువన గోదావరి పుష్కరాల సమయంలో మెట్లను నిర్మించారు. వీటి ద్వారానే భక్తులు గోదావరి తీరానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి ఎగువన ఉన్న గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే ఘాట్ ఉంది. ఇక్కడ లేదా ఇంకా ఎగువ లేదా దిగువ భాగంలో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంది. తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వతంగా బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తే నది విహారానికి భక్తులు, పర్యాటకుల ఆదరణ పెరిగే అవకాశం ఉంది. తద్వారా టూరిజం అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

పర్యాటక, దేవాదాయ శాఖలు దృష్టి పెడితే...

ప్రస్తుతం గోదావరి నదిపై ఉన్న మొదటి బ్రిడ్జి నిర్మాణానికి పూర్వం లాంచీల ద్వారానే భక్తులు, ప్రజలు భద్రాచలానికి రాకపోకలు సాగించారు. లాంచీ ప్రమాదం జరగటం, తద్వారా మొదటి బ్రిడ్జి నిర్మాణం జరగటంతో భద్రాచలం కేంద్రంగా లాంచీల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏపీలో ఉన్న పోచవరం వద్ద నుంచే పాపికొండలకు లాంచీల విహారం నడుస్తోంది. అది కాకుండా గోదావరి వరదలు ముంచెత్తినప్పుడు వరద ముంపు బాధితులను రక్షించేందుకు మాత్రమే ఏపీ నుంచి లాంచీలను తీసుకొచ్చి సహాయక చర్యలను చేపడుతున్నారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నందున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శాశ్వతంగా నిలిచే అవకాశం ఉందని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం కేంద్రంగా జలవిహారంను అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖ ప్రణాళికలను రూపొందించాలని పలువురు కోరుతున్నారు. భద్రాచలం వద్ద నుంచి మోతె గడ్డలో కొలువై ఉన్న శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు లాంచీల విహారానికి అవకాశం ఉంది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తే టూరిజం అభివృద్ధితోపాటు ద్వీపంలా ఉండే మోతె గడ్డ ఆలయం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు భద్రాచలంలోనే జలవిహారం అనుభూతులను పొందవచ్చు. ఇప్పటికైనా పర్యాటక, దేవాదాయ శాఖలు దృష్టి సారించి భద్రాచలం కేంద్రంగానే జలవిహారం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



జలవిహారంలో చిన్నారుల కేరింతలు (ఫైల్)

అందుబాటులోకి తేవాలి..



గోదావరిలో జలవిహారం చేయాలంటే పాపికొండల యాత్రకు ఏపీలో సుదూరంగా ప్రయాణించాల్సి వస్తుంది. భద్రాచలం కేంద్రంగా బోటింగ్ పాయింట్‌తో పాటు నదిలో విహరించేలా అన్ని రక్షణ చర్యలతో లాంచీలు ఏర్పాటు చేయాలి. మోతె గడ్డ, ఆ పైన ఉన్న పర్ణశాలల వరకు జల విహారం చేసేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి. జలవిహారానికి అవకాశం కల్పిస్తే భద్రాచలానికి జాతీయస్థాయిలో పర్యాటక గుర్తింపు లభించే అవకాశం ఉంది.

– లోకేష్, స్థానికుడు

ఆగిన కంచుమేళం

- అనారోగ్యంతో కోయకళాకారుడు, పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి
- పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన కలెక్టర్ జితేష్
- సంతాపం వ్యక్తం చేసిన మంత్రులు, ఎమ్మెల్యే



పద్మశ్రీ సకిని రామచంద్రయ్యకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు టౌన్: కంచుమేళం శాశ్వతంగా ఆగిపోయింది. తాళానికి నిశబ్దం ఆవరించింది. ఆదివాసీ సంప్రదాయ కళల రక్షకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య తుదిశ్వాస విడిచారు. అంతరించిపోతున్న గిరిజన కళలను కాపాడుతూ, కాలినడకన మారుమూల గ్రామాల్లో తిరుగుతూ భవిష్యత్ తరాలకు అందించిన కోయజాతి ఆణిముత్యం, జానపద కళాకారుడు, డోలు వాయిద్యకారుడు రామచంద్రయ్య(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా గొంతు సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన లోకాన్ని విడిచివెళ్లారు. రామచంద్రయ్యకు భార్య బాపనమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కాగా ఓ కుమారుడు 2008లో కాలేయ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కంచుతాళం, మేళంతో ఆదివాసీ కథలు అలవోకగా, కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన ఏకైక కళాకారుడు మన రామచంద్రయ్య.

ప్రముఖుల సంతాపం

రామచంద్రయ్య మృతిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

కుటుంబ సభ్యులకు కలెక్టర్ హామీ

కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కూనవరంలోని రామచంద్రయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, స్థలం సమస్య ప్రస్తావించగా, పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని, అంత్యక్రియల అనంతరం తన వద్దకు రావాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగేనా.?

కుటుంబ సభ్యులు, జిల్లా ఎంపీటీసీల ఫోరం ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా.. ఆ విషయంపై ప్రభుత్వంతో మాట్లాడతానని కలెక్టర్ హామీనిచ్చారు.

అందని నాటి ప్రభుత్వ సాయం

మణుగూరు మండలం కూనవరం పంచాయతీకి చెందిన సకిని రామచంద్రయ్య వనదేవతల వీర గాథలు చెప్పడంతో పాటు రెండేళ్లకోసారి వచ్చే ఆదివాసీ జన జాతరైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజుల వంటి దేవరుల కథను కళ్లకు కట్టినట్లుగా గానం చేయడంతో పాటు సమ్మక్క సారలమ్మ తల్లులను గద్దెల వద్దకు తీసుకు వచ్చే క్రమంలో కీలకంగా వ్యవహరిస్తారు. అంతరించిపోతున్న ఆదివాసీ కళలను కాపాడుతున్న తీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 జనవరి 25న పద్మశ్రీ అవార్డు అందజేసింది. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సత్కరించింది. ఆ వెంటనే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.కోటి ఆర్థికసాయంతో పాటు 426 చదరపు గజాల ఇంటి స్థలం అందిస్తామని ప్రకటించింది. కానీ ఇవ్వలేదు. అనారోగ్యంతో ఉన్న తనకు ఆర్థిక సాయం అందించి, కాపాడాలని కలెక్టరేట్ చుట్టూ తిరిగినా, అధికారులకు విన్నవించినా మోక్షం కలగలేదు. 2023 డిసెంబర్‌లో జిల్లా కేంద్రంలో స్థల సర్వే చేసినప్పటికీ అది సర్వేకే పరిమితమై చేతికి పత్రాలు అందలేదు. కళాకారులకు అందించే రూ.10 వేల పింఛన్ అందించడంలోనూ జాప్యం జరిగింది.



డోలుతో సకిని రామచంద్రయ్య (ఫైల్)

పలుమార్లు కలెక్టర్లకు విన్నవించినా ఆర్థిక సాయం ట్రెజరీ నుంచి రావాలంటూ సమాధానం రావడంతో వైద్య పరీక్షలకు అప్పులు చేసి రూ.4 లక్షలతో వైద్యం చేయించుకున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచార సమయంలో మణుగూరు వచ్చిన రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్కను కలిసి న్యాయం చేయాలని వేడుకోగా.. ఆమె ఆర్థిక సాయం అందించారు. ఎన్నికల కోడ్ ముగిశాక కలవాలని సూచించగా, ఆయన కుటుంబ సభ్యులు ఈ నెల 21న మళ్లీ సీతక్కను కలిశారు. దీంతో నాలుగైదు రోజుల్లో చెక్కు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కాగా ఈ లోపే రామచంద్రయ్య మృతి చెందారు.

ఆర్థిక ఇబ్బందులతో మరణించడం బాధాకరం

ఖమ్మంమయూరిసెంటర్ : కోయ అధ్యయన వేదిక ఆత్మీయ మిత్రుడు, సమ్మక్క సారలమ్మ తదితర కోయ వీరపురుషుల కథా గాయకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సకిని రామచంద్రయ్య ఆర్థిక ఇబ్బందులతో మరణించడం బాధాకరమని ప్రముఖ కవులు పద్దం అనసూయ, డాక్టర్ గూడూరు మనోజ, జయధీర్ తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వయసు పైబడి మరణించలేదని, గత ప్రభుత్వం ఇస్తామన్న రూ. కోటి ఆర్థిక సాయం నేటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోయ ఆదివాసీ కళాకారుడు ఇలాంటి స్థితిలో మృతిచెందడం కలచి వేస్తోందని తెలిపారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా..

ముగిసిన ఒలింపిక్ డే రన్



క్రీడాజ్యోతిని అందుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని, క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌లో క్రీడాజ్యోతితో పరుగులు పెట్టారు. ప్రజాప్రతినిధులు, యువ క్రీడాకారులు, అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో రన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 20న దమ్మపేటలో ప్రారంభమైన రన్, భద్రాచలం, ఇల్లెందు తదితర ప్రాంతాల మీదుగా ఆదివారం కొత్తగూడెం చేరుకుంది. క్రీడాజ్యోతిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డీవైఎస్‌ఓ సంజీవరావులకు అందజేయగా, ప్రకాశం స్టేడియం నుంచి మున్సిపల్ ప్రగతి మైదానం వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ జూలైలో ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్ పోటీల్లో మనదేశం అధిక సంఖ్యలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇంకా జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కె.సంజీవరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కె.మహిధర్ మాట్లాడారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా క్రీడాజ్యోతితో రన్ నిర్వహించామని తెలిపారు. తొలుత ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, సీనియర్ క్రీడాకారుడు బి.హరినాథ్‌రెడ్డి మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ చైర్మన్ నాగేందర్ త్రివేది, జిల్లా కరాటే అసోసియేషన్ సెక్రటరీ ఈ. శ్రీధర్, రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ బరిగెల భూపేష్, యోగా సెక్రటరీ గుమలాపురం సత్యనారాయణ, రాసపల్లి రాజేంద్రప్రసాద్, గొట్టపు రాధాకృష్ణ, ఉష, రాచర్ల రఘు, ఉదయ్, కోచ్ పి.నాగేందర్, పీడీ స్వాతి పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా పద్యగాన పోటీలు



నీలం వెంకటేశ్వర్లుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: చందాల కేశవదాసు కళా పరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పద్యగాన పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో చందాల కేశవదాసు 148వ జయంతి సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షుడు కొండపల్లి జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో నీలం వెంకటేశ్వర్లుకు (పల్నాడు జిల్లా) మొదటి బహుమతి, ప్రకాశం (ఖమ్మం)కు రెండవ బహుమతి, ముక్తి భాస్కరరావు (ఖమ్మం) మూడో బహుమతి దక్కాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు ఎస్.దామోదర్, ఖాదర్ బాబు, విజయలక్ష్మి, సులేమాన్, న్యాయవాది కర్లపుడి శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపే సమస్యల పరిష్కారం

- హామీలు అమలు చేసి ప్రతిపక్షాలు నోరు మూయిస్తాం
- రూ.31 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ
- రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



ఆరెంపుల సభలో మంత్రి పొంగులేటికి పుష్పాభిషేకం చేస్తున్న రైతులు

ఖమ్మంరూరల్/ కూసుమంచి : పాలేరు నియోజకవర్గంలోని సమస్యలన్నీ ఏడాది లోపే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ కొన్ని ప్రతిపక్ష పార్టీలు అవాకులు, చెవాకులు పేలుతున్నాయని, హామీలు నెరవేర్చి వాటి నోర్లు మూయిస్తామని అన్నారు. రెండు నెలల్లో రూ.31 వేల కోట్ల రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని గత పాలకులు అప్పులకుప్పగా మార్చిందని, తాము అష్టకష్టాలు పడైనా ప్రతీ హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాగా రుణమాఫీని హర్షిస్తూ ఆరెంపుల గ్రామంలో మంత్రికి పుష్పాభికం చేశారు.

పంటలకు ఊపిరి..

- జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షంతో రైతుల హర్షం
- ఊపందుకోనున్న వ్యవసాయ పనులు
- ఇప్పటికే పత్తి విత్తనాలు నాటిన రైతులకు ఊరట
- వరినార్లు పోసుకునేందుకు అదను



వర్షానికి ఊపిరిపోసుకున్న పత్తి మొక్కలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/బూర్గంపాడు: నిన్నటి వరకు దోబూచులాడిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. పత్తి గింజలు నాటి 15 రోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరట కలిగింది. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సుమారు 78 వేల ఎకరాల్లో గింజలు వేశారు. కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులతో పత్తి గింజలు మొలకలు రాకపోవటంతో రెండోసారి కూడా విత్తనాలు వేశారు. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు రైతులందరూ పత్తి సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావటంతో ఈ ఏడాది జిల్లాలో పంటల సాగు ఆలస్యంగా మొదలైంది. జిల్లాలో 70శాతం విస్తీర్ణంలో పంటల సాగు వర్షాధారమే కావటంతో రైతులు వానల కోసం ఎదురుచూశారు. ఈ వర్షానికి ఒక్కసారిగా పంటల సాగు ఊపందుకోనుంది. జిల్లాలో సుమారు 1.65వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేపట్టనున్నారు. వరినార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మాగాణుల్లో పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసిన జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు ఈ వర్షాలకు మొలకెత్తుతున్నాయి. ఇక అన్నదాతలు సన్నరకాల వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

వర్షపాతం ఇలా..

జిల్లాలో ఆదివారం అత్యధికంగా అశ్వారావుపేటలో 122 మి.మీ వర్షపాతం, అత్యల్పంగా ఆళ్లపల్లిలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సరాసరి వర్షపాతం 48.7 మి.మీగా నమోదైంది. ఈ నెలలో 15 మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. 6 మండలాల్లో సాధారణ వర్షపాతం, రెండు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెలలో ఇప్పటివరకు 119.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, అధికంగా 154.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కరకగూడెం, పినపాక, చర్ల, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, చుంచుపల్లి, సుజాతనగర్, బూర్గంపాడు, భద్రాచలం, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెం, మణుగూరు, చంద్రుగొండ, కొత్తగూడెం, పాల్వంచ, ములకలపల్లి మండలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. అన్నపురెడ్డిపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

జిల్లాలో ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలు (మి.మీ.లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
కరకగూడెం	39	అన్నపురెడ్డిపల్లి	28
పినపాక	51.6	చుంచుపల్లి	57.6
చర్ల	54.2	సుజాతనగర్	43.6
దుమ్ముగూడెం	25.4	కొత్తగూడెం	62
అశ్వాపురం	28.4	లక్ష్మీదేవిపల్లి	49.4
మణుగూరు	95.6	పాల్వంచ	25.8
ఆళ్లపల్లి	4.2	బూర్గంపాడు	36.8
గుండాల	30.8	భద్రాచలం	36.8
ఇల్లెందు	32.6	ములకలపల్లి	55.4
టేకులపల్లి	45.4	దమ్మపేట	95.8
జూలూరుపాడు	35.6	అశ్వారావుపేట	122.6
చంద్రుగొండ	56.8	జిల్లా మొత్తం	1120.6

అందని రైతు భరోసా

పంటల సాగు ఊపందుకోనుండటంతో రైతులు పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలకు చెల్లించేందుకు ప్రస్తుతం డబ్బులు అవసరముంది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం ఈ ఏడాది ఇప్పటివరకు అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయంగా రైతుభరోసా అందిస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు రైతు భరోసా విడుదలపై స్పష్టమైన ప్రకటన రాలేదు. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేందుకు రుణమాఫీ చేయాల్సి ఉంది. రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా, రుణమాఫీ చేసి కొత్తరుణాలు ఇచ్చే సరికి వ్యవసాయ సీజన్ సగానికి చేరుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు అప్పులు తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. రుణమాఫీ చేసేందుకు సమయం పడుతుండటంతో పెట్టుబడి సాయంగా రైతుభరోసాను త్వరితగతిన అందించాలని రైతులు కోరుతున్నారు.

49.53 శాతం సాగు..

వర్షాధార సాగు పంటలకు సంబంధించి పంట విత్తనాలు నాటేందుకు తోడ్పడే వర్షం పడింది. దీంతో జిల్లాలో పత్తి విత్తనాలు నాటే ప్రక్రియ ఊపందుకోనుంది. వర్షాధార మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు కూడా అనుకూలమైన వర్షంగా పేర్కొనవచ్చు. వానాకాలం పంటల సాధారణ విస్తీర్ణం 4,71,622 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 2,33,577 ఎకరాల్లో పంటలు వేయగా, జిల్లాలో వానాకాలం పంటల సాగు 49.53 శాతంగా నమోదైంది.

వ్యవసాయ పనులకు అనుకూలం..



జిల్లాలో సాగుకు అవసరమైన వర్షం పడింది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలతో పంటలను వేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. వానాకాలం సీజన్ పంటలు వర్షం పడడంతో ఊపందుకోనున్నాయి.

–బి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

రజతోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం గాంధీచౌక్ : వచ్చే నెల 20న హైదరాబాద్‌లో జరిగే శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ రఘునాథాచార్యులు మాట్లాడుతూ.. వేడుకలకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ శేషాచార్యులు, సహాయ కోశాధికారి ఎన్‌సీహెచ్ పాండురంగాచార్యులు, ఎం. కేశవాచార్యులు గోపాల్, గోవర్ధన వెంకటరమణ, కె.కిరణ్‌కుమార్ ఎం.వేణు కె.మధు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

టేకులపల్లి: ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను టేకులపల్లి పోలీసులు ఎట్టకేలకు రికవరీ చేశారు. టేకులపల్లి మండలం వెంకట్యాతండాకు చెందిన ఆంగోతు భాస్కర్ తన ఫోన్‌ను మూడు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయగా.. టేకులపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ రికవరీ చేసి ఆదివారం బాధిత యువకుడికి టేకులపల్లి ఎస్‌ఐ షేక్ సైదారవూఫ్ అందజేశారు. దీంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

దమ్మపేట: మండల కేంద్రంలోని అర్బన్‌కాలనీకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామంలోని అర్బన్‌కాలనీకు చెందిన దగ్గుబాటి తిరుపతమ్మ (52) ఈ నెల 16వ తేదీన ద్వారకా తిరుమలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. కానీ మరుసటి రోజుకు కూడా ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో ఆచూకీ కోసం వెతికారు. అయినా జాడ లభించకపోవడంతో ఆమె కుమారుడు ఫణీంద్రకుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు..

జూలూరుపాడు: ఓ మైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై స్థానిక పోలీసులు ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ బి.తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన ఇంటర్ చదువుతున్న ఓ మైనర్‌ను అదే గ్రామానికి చెందిన యువకుడు వేధింపులకు గురి చేస్తున్నాడు. గత రెండు నెలలుగా బాలిక వెంటపడుతూ తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకుంటానని బలవంతం చేస్తుండడంతో విషయాన్ని తల్లిదండ్రులకు ఆమె చెప్పింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.


మిర్చి వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారి ధరావత్ రవి ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం, మేకల విక్రయ వ్యాపారం చేస్తున్న గ్రామానికి చెందిన రవి మూడేళ్లుగా మిర్చి కొనుగోళ్ల వ్యాపారం ప్రారంభించాడు. అయితే మిర్చి వ్యాపారంలో నష్టాలు రావడంతో కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో మానసికంగా కుంగిపోయాడు. మొత్తంగా రూ.10లక్షల వరకు అప్పు ఉండడం, అప్పు ఇచ్చిన వారి సూటిపోటి మాటలు భరించలేక ఆదివారం ఉదయం చేను వద్ద పురుగుల మందు సేవించాడు. తర్వాత రవి బైక్‌పై ఇంటికి చేరుకుంటుండగా మార్గమధ్యలోనే పడిపోవడంతో గమనించిన గ్రామస్తులు అతడిని కొమరారం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో ఇల్లెందు ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తల్లీ, కుమారుడు..

ముదిగొండ/రఘునాథపాలెం: తల్లీ, కుమారుడు పుగురులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని సువర్ణాపురం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన కొణతాల నర్సమ్మ, ఆమె కుమారుడు గిరి తమ స్వగ్రామం నుంచి బైక్‌పై సువర్ణాపురం పరిధిలోకి వచ్చి పురుగులమందు సేవించారు. వారిని స్థానికులు గుర్తించి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ముదిగొండ ఎస్‌ఐ గజ్జెల్ల నరేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు




టన్ను ధర	రూ.13,438

వేగంగా సవరణ

చకచకా భూముల ధరలు పెంపు ప్రక్రియ

- ఇప్పటికే పూర్తయిన కమిటీల ప్రాథమిక సమావేశం
- ప్రభుత్వ, మార్కెట్ విలువ ఆధారంగా ప్రతిపాదనలు
- బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పెరగడం ఖాయం
- ఖమ్మంలో కొత్త కలెక్టరేట్ చుట్టుపక్కల భూముల ధరకు రెక్కలు?



ఖమ్మంమయూరిసెంటర్ : వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేగవంతం అయింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో భూముల విలువ పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలతో పోలిస్తే.. బహిరంగ మార్కెట్ విలువ అధికంగా ఉంది. బహిరంగ మార్కెట్ విలువలో సగం వరకు ప్రభుత్వ విలువ పెంచితే ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తుందనేది సర్కారు యోచన. దాని ప్రకారం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెంచాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ధరల పెంపునకు సంబంధించిన ప్రక్రియకు ఈనెల 7న ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయగా, దాని ప్రకారం ఉమ్మడి జిల్లాలో భూముల విలువలు సవరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

20, 21 తేదీల్లో సమావేశాలు పూర్తి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలతోపాటు 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలను పెంచేందుకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 20న భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌లో, 21న ఖమ్మం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏయే ప్రాంతాల్లో భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎలా ఉన్నాయి..? అక్కడ ప్రభుత్వ ధర ఎంత ఉంది అనే వివరాలపై చర్చించారు. వీటితో పాటు భూముల ధరలు ఎంత వరకు పెంచొచ్చనే అంశాలనూ పరిశీలించారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు..

భూ విలువలు పెంచేందుకు ఆయా జిల్లాల్లో గ్రామీణ కమిటీలకు చైర్మన్‌గా ఆర్డీఓ, సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీఓ, మార్కెట్ వ్యాల్యూ సబ్ రిజిస్ట్రార్‌ను, కన్వీనర్‌గా స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను నియమించారు. ఇక అర్బన్ కమిటీలకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్ సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో కొత్త వార్డులు, కొత్త కాలనీలు, వాణిజ్య భవనాల వివరాలను మున్సిపల్ అధికారులు అర్బన్ కమిటీకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కన్వర్షన్‌కు సంబంధించిన వివరాలను తహసీల్దార్లు కమిటీకి అందించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఈ నెల 29వ తేదీలోగా అధికారులు భూముల ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. పెరిగే భూమి విలువను జూలై 1న పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతారు. జూలై 15 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు 20వ తేదీ వరకు గడువు విధించారు. ఇక ఆగస్టు 1 నుంచి పెరిగిన భూ విలువలను ప్రభుత్వం అమలు చేయనుంది.

సర్కారు ఖజానా నిండేలా..

ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో భూ విలువలు సవరిస్తారు. దీనిపై కమిటీలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సూచనలతో అటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఇటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగేలా విలువలు పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రధానంగా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువలను భారీగా పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో మెయిన్ రోడ్డుకు ఉన్న వ్యవసాయేతర భూముల విలువ ప్రస్తుతం ఉన్న ధరకు నాలుగు నుంచి ఐదు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ విలువల ఆధారంగా కనీసం 20 నుంచి గరిష్టంగా 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఇక జాతీయ రహదారుల వెంట భూ విలువలు పెరుగుతాయని అంతా భావిస్తున్నా పలు కారణాలతో ఆయా ప్రాంతాల్లో సాధారణంగానే ధరలు పెరగనున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం నగరంలో త్రీటౌన్ ప్రాంతంలో ప్రభుత్వ భూ విలువ బహిరంగ మార్కెట్ విలువకు సమానంగా ఉండడంతో ఈసారి నామమాత్రంగానే పెంచే అవకాశం ఉంది.

రూ.400 కోట్ల వరకు ఆదాయం..

వ్యవసాయ, వ్యవసాయేతర భూ విలువను పెంచితే ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.400 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరలతో ఉమ్మడి జిల్లాలో సంవత్సరానికి రూ.250 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. భూ విలువలు పెరిగితే జిల్లా నుంచి భారీగా ఆదాయం వస్తుందని, అంచనాకు మించి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పని లేదని అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తాం..



భూముల విలువల సవరణ ప్రక్రియను ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కమిటీల సమావేశాలు పూర్తి చేశాం. ఈ నెల 29 నాటికి భూ విలువలను ఫైనల్ చేసి ప్రజల ముందు ఉంచుతాం. ప్రజల అభ్యంతరాలు స్వీకరణ, పరిష్కారం అనంతరం జూలై 24న భూముల విలువలను ఫైనల్ చేస్తాం.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ

మరమ్మతులు త్వరగా చేపట్టాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కోతకు గురైన బ్రిడ్జి రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రహదారి.. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు పంట పొలాలు సైతం నాశనమయ్యాయి. నాడు బ్రిడ్జికి తాత్కాలికంగా మరమ్మతులు చేసినా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోయారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం మరలా అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి సదరు బ్రిడ్జిని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత తరుణంలో సమస్యకు శాశ్వత పరిష్కారానికి వీలుబడడం లేదన్నారు. బ్రిడ్జికి ఇరువైపులా కాంక్రీటుతో రోడ్డును పటిష్టం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఆ తర్వాత అక్కడి గ్రామస్తుల నుంచి బ్రిడ్జి సమస్యతో పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని ఓపికగా వారికి సమాధానం ఇచ్చారు. ఈక్రమంలో మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని తహసీల్దార్ కోరగా స్వచ్ఛభారత్లో భాగంగా అవసరమైన మేరకు నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. ఆ తర్వాత వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీ వారు చూసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్, ఆర్‌ఐ షేక్ హుస్సేన్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాలే ప్రజలకు అండ..

- మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం
- కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాలలో కేంద్ర ప్రభుత్వం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

బూర్గంపాడు: ప్రజలకు ఏ కష్టమొచ్చిన ఎర్రజెండాలే అండగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సారపాక తాళ్లగొమ్మూరులోని ఐటీసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా 2వ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుందని, కార్పొరేట్‌శక్తుల చేతుల్లో కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మగా మారి కాపలాదారుగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వారి హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఏఐటీయూసీ కార్మిక సంఘంగా ఉందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను వేలం వేసేందుకు కుట్రలు చేయడంతో పాటు సంఘాలు పెట్టుకోవడం, నిరసనలు తెలిపే అవకాశాలను కూడా కేంద్ర ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. దేశ రక్షణ, కార్మిక హక్కుల రక్షణ ఎర్ర జెండాలతోనే సాధ్యమవుతుందని, కార్మిక సంఘాలు సిద్ధాంతాలు వేరైనా లక్ష్యం ఒకటేనన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం రాజకీయ చైతన్యాన్ని పెంచుకొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాటాలను వివరించారు. కడారు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలను వాసిరెడ్డి సీతారామయ్య జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ మహాసభలలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బొల్లోజు అయోధ్య, పాకలపాటి వెంకటేశ్వరరావు, శింగు నర్సింహారావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ముత్యాల విశ్వనాథం, రేసు ఎల్లయ్య,కల్లూరి వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, సీహెచ్.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో చోరీకి యత్నం..

దొంగను బంధించిన గ్రామస్తులు



పట్టుబడిన దొంగతో పోలీసులు

ఇల్లెందురూరల్ : మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ నిజాంపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి యత్నించిన ఓ దొంగను గ్రామస్తులు చాకచక్యంగా బంధించారు. వివరాలిలా.. గ్రామానికి చెందిన బర్ల వీరన్న ఇంట్లోకి తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి చొరబడే యత్నం చేశాడు. ఈక్రమంలో ఇంటి వాకిట్లో అలికిడి శబ్దం విన్న వీరన్న పక్కింటికి చెందిన మాలోత్ అశోక్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఇరువురు అప్రమత్తమై ఆ వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి వద్ద టార్చిలైట్, బ్లేడ్‌లు ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు సదరు వ్యక్తిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టుబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం పట్టుబడిన వ్యక్తి గజదొంగగా పేరుబడిన మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన గుగులోత్ రంజిత్‌గా నిర్ధారించారు.

బ్లేడ్‌తో దాడి..

ఒకరికి గాయాలు



గాయపడిన నాగరాజు

జూలూరుపాడు: కాపురానికి రావడం లేదని భార్యపై భర్త దాడి చేసేందుకు ప్రయత్నించగా మధ్యలో అడ్డు వచ్చిన ఓ వ్యక్తి మెడను బ్లేడ్‌తో కోసి గాయపరిచిన ఘటన ఆదివారం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామచంద్రాపురానికి చెందిన తాటి వైష్ణవి, టేకులపల్లి మండలం రామచంద్రపేటకు చెందిన కుమారస్వామి నాలుగేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వైష్ణవి ఐదు నెలల కిందట రామచంద్రాపురంలోని పుట్టింటికి వచ్చింది. భార్య కాపురానికి రాకపోవడంతో ఆదివారం కుమారస్వామి పెద్దమనుషులను వెంటబెట్టుకొని రామచంద్రాపురం వచ్చాడు. పంచాయితీ జరుగుతుండగా ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. వైష్ణవిపై భర్త కుమారస్వామి దాడి చేసేందుకు ప్రయత్నించడంతో రామచంద్రాపురానికి చెందిన నాగరాజు అడ్డురావడంతో అతడిపై బ్లేడుతో దాడి చేశాడు. ఈ దాడిలో నాగరాజు మెడకు తీవ్ర గాయం కాగా.. స్థానిక ఆస్పత్రికి తరలించారు. నాగరాజుపై దాడి చేసిన కుమారస్వామిని వైష్ణవి బంధువులు చితకబాది గదిలో బంధించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కుమారస్వామిని అదుపులోకి తీసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దమ్మపేట: అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. ఆదివారం మండలంలోని రెడ్యాలపాడు గ్రామ శివారులో గల మల్లెపూల వాగు నుంచి ట్రాక్టర్‌ద్వారాఇసుకను అక్రమంగా సత్తుపల్లి వైపునకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో గణేష్‌పాడు సమీపానికి రాగానే పోలీసులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్ కు తరలించి సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

మొండికుంటలో నగదు, మల్లెలమడుగులో బైక్ చోరీ



మొండికుంటలో బీరువా పగులగొట్టిన దొంగలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం రాత్రి ఓ ఇంట్లో తాళం పగులగొట్టి రూ.50 వేలు, మల్లెలమడుగులో ఓ ఇంటి ముందు ఉన్న బైక్‌ను దొంగలు చోరీ చేశారు. మొండికుంట గ్రామానికి చెందిన పైళ్ల శివ ఇంటికి తాళం వేసి అత్తవారి ఊరికి వెళ్లారు. తెల్లవారిన తరువాత ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు శివకు సమాచారం ఇవ్వడంతో పాటు ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలోని రూ.50 వేలు నగదు దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. అదే విధంగా మల్లెలమడుగు గ్రామంలో బచ్చలకూరి వెంకట్ తన ఇంటి ముందు బైక్ నిలపగా అర్ధరాత్రి సమయాన దొంగలు బైక్‌ను చోరీ చేశారు. దీంతో బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ అశోక్ రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలాలు పరిశీలించి ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం బృందంతో ప్రత్యేక విచారణ చేయించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి పోస్టులకు 28న ఇంటర్వ్యూలు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, పీజీ, మహిళా కళాశాలలో ఖాళీగా ఉన్న ఆరు (హిస్టరీ, కామర్స్, స్టాటిటిక్స్, ఫిజిక్స్ విత్ ఎలక్ట్రానిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) సబ్జెక్టుల్లో ఒక్కో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు ఆదివారం కళాశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఇంటర్వ్యూతో పాటు డెమో క్లాసులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. 2024 – 25 విద్యాసంవత్సరానికి గాను ఈ నియామకాలు చేపడుతున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా అభ్యర్థులు డిగ్రీ, పీజీలో 50 శాతం మార్కులకు తగ్గకుండా ఉత్తీర్ణత సాధించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45 శాతం ఉన్నా సరిపోతుందని వివరించారు. నెట్, స్లెట్‌ల్లో అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

ప్రతీ నోటిఫికేషన్‌కు పేపర్ ప్రకటన ఇవ్వాలి..

సింగరేణి విద్యాసంస్థల్లో ఖాళీలకు సంబంధించిన ప్రతి నోటిఫికేషన్ పేపర్‌లో ప్రకటన ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నోటీస్ బోర్డులో పెడితే కాలేజీలో పనిచేసే వారికి మాత్రమే తెలుస్తుందని, మిగితా వారికి తెలియక నష్టపోతారని పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన టిప్పర్

టేకులపల్లి: బొగ్గు రవాణా చేస్తున్న ఓ టిప్పర్ వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టడంతో డివైడర్ ధ్వంసమైన సంఘటన టేకులపల్లిలోని పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కేటీపీ నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా చేసే టిప్పర్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో డివైడర్ ధ్వంసం కాగా ఢీకొట్టిన టిప్పర్ వివరాలు తెలియాల్సి ఉంది.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతయ్య

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వర్గ వ్యతిరేక నిర్ణయాలపై ఉద్యమించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య పిలుపునిచ్చారు. మండంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఇఫ్టూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఫాసిస్టు ప్రభుత్వం నియంతృత్వాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. సమానత్వాన్ని అంగీకరించదని, ప్రశ్నించే హక్కును కాలరాస్తోందని, జాతీయవాదాన్ని హిందూ జాతీయ వాదంగా మారుస్తోందని ఆరోపించారు. హేతువాదులైన గౌరీశంకర్ దభోల్కర్, కల్బుర్గి, గోవింద్ పన్సారీ లాంటి మేథావులను హత్య చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలైన బ్యాంకు, రైల్వే, ఓడరేవులు, విమానయానం, బీమా సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు చేస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని కోరారు. అంతకు ముందు భారీ ప్రదర్శన నిర్వహించారు. సమావేశలంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, నాయకులు భాస్కర్, చీకట్ల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, విశ్వనాథం, వరదయ్య, ఎస్కే మదార్, రాంసింగ్, ఊక్లానాయక్, సరళ, సాంబ పాల్గొన్నారు.

కిన్నెరసానిలోకి కొత్త నీరు



స్వల్పంగా పెరిగిన కిన్నెరసాని నీటిమట్టం, (ఇన్‌సెట్) జలాశయం లెవల్ సూచిక

పాల్వంచరూరల్ : అడుగంటిన కిన్నెరసాని జలాశయంలోకి.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరింది. దీంతో నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 396.20 అడుగుల మేర నీరు నిల్వ ఉందని డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు. ప్రతి రోజు జలాశయం నుంచి 120 క్యూసెక్కుల నీరు కేటీపీఎస్ కర్మాగారానికి, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు తాగునీరు, ఎన్ఎండీసీ, నవభారత్ కర్మాగారాలకు సరఫరా చేస్తున్నామని వివరించారు.

పర్యాటకుల సందడి..

కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 615 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.21,740 ఆదాయం లభించగా, 300 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.18,340 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

గాయపడిన అడవిపందికి చికిత్స

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో అడవి పంది గాయపడి ఉండటంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన పందికి చికిత్స చేయించిన అనంతరం ముచ్చర్ల రిజర్వ్ ఫారెస్టులో వదిలిపెట్టామని కారేపల్లి ఎఫ్ఆర్ఓ హరిప్రసాద్ తెలిపారు.

'దాల్ మిల్లర్స్' రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



కొత్తగూడెంఅర్బన్: దాల్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగూడేనికి చెందిన కొదుమూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాల్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శ్రీనివాసరావు ఎన్నిక పట్ల వివిధ సంఘాల నాయకులు కంభంపాటి రమేష్, మొరిశెట్టి భవానిప్రసాద్, గుడాల అచ్యుతం, అశోక్‌రాఠీ, తాటిపల్లి శంకర్ బాబు, పల్లపోతు సాయిబాబా, అత్తులూరి ఉమా మహేశ్వరరావు, నరేంద్రుల సురేష్, పల్లపోతు శ్రీనివాసు, దారా నగేష్, గౌరు వెంకటేశం హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయిలో రాణిస్తున్న కథా రచయిత



రంగనాథ్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి చెందిన సింగరేణి ఉద్యోగి శ్రీరంగం రంగనాథ్ అనేక తెలుగు కవితలు, కథలు రాస్తూ జాతీయ స్థాయిలో పలు బహుమతులు అందుకున్నారు. రంగనాథ్ రాసిన 'ఎక్కిరింపు' కథ జాతీయ స్థాయి కథల పోటీలలో ప్రథమ బహుమతి సాధించింది. అలాగే 'ప్రాణం తీసిన పైసలు', దేవుని చెట్టు, రథం ముగ్గు, కాకుల డైటింగ్, ఆరిపోని దీపం, దేవుడు పారిపోయాడు వంటి అనేక కథలకు సైతం బహుమతులు దక్కాయి. ఇటీవల ఓ మాస పత్రిక నిర్వహించిన కథల పోటీల్లో 'అయోధ్యాపురి టూ వైకుంఠపురి'.. కథకు, హాస్యానందం వారు నిర్వహించిన కథల పోటీలలో 'పడుచు పెళ్లాం సైకిల్ పై సవారీ' కథకు కూడా బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ తాను రాసిన కథలను చదివి ఆదరిస్తున్న కథాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.